# నన్ను నేనే రచ్చించుకున్నా!

–అవసరాల రామకృష్ణారావు

అలా ఆడిని గాలిలో తేలిపోయే నాగ సేసినాను గందా.. ఆ దూకుడికి తట్టుకోనేక గదిలోకి సేరినాను గందా.. ఒల్ల కూరుకోనేక పోయింది నా గుండె. సుట్ట ముక్క ముట్టించినాను. రింగు రింగుల బయలెల్లే ఆ పొగ ఎనక్కి ఎనక్కి సుట్టుకుంటూ ఎన్నెన్ని యిసయాలు యాదికి తెచ్చినాదో!

○ ○ ○

మా యమ్మా, సిన్నత్తా, పెద్దక్కా, నానూ మే మందరం ఓ పూరిపాకనో ఉంటేటోల్లం. కట్టపడ్డా తెగ తాగేసి కాన్దబ్బు యింటికియ్యని మొగోల్లని తన్ని తగిలేసినాం గనక, మా పాకల ఆడోల్లదే సామరాజ్జెం. పయిట ఏసుకుని యింకా ఏడాది దాట్నేదు గనక నన్నింకా కూలికి రానిచ్చేటి వోరు కారు. ఆల్లూ అలా ఎల్లనిచ్చి తడిక తలుపు దగ్గిరగా ఏసి ఎదురింటి మేడ మీని చూడెంటు కుర్రోడి గదిలోకి తప్పుకొనేదాన్ని. ఆడదాయికి అదిగలాంటి సోట కితకితలు మా రమ్ముగా ఉంటాయని తొలిసుట్టు తెలుసుకున్నాక అట్టాంటిది మల్లీ మల్లీ కావాలనిపించేది. ఆ చంగతి పోల్సిన సుట్టు పక్కల పడుసోల్లు ఇజిల్సు మీన ఇజిల్సు కొట్టేటివోరు. మా అమ్మ కొట్టింది, తిట్టింది, వాతలు పెట్టినాది. 'ఈదిన పడి రోజు కూలీ సెస్తే గాని రెక్క కట్టం ఆడ కూతుల్లం. పని సూపిచ్చిన మేత్తిరీ బాబు పక్కలోకి రమ్మంటే ఎల్లకపోతే మర్నాడు పని దొరక్క పస్తులుండే దిక్కుమాలినోల్లం. సచ్చినట్టు పడుండక పోకిరీ యాసాలు ఏసేవా పొయిలో పెట్టేస్తే' అని బెదిరించినాది. ఉడుకుపట్టిన వణ్ణం ఊరుకోనేదు గందా! చైకిలు రిపేరు సేసే సాయిబుల కుర్రోడితో లేసి ఒచ్చేసినాను. ఈ యిదంగా సేతులు మారిన పడుసు గుంటని ఏ యిదేశాలకి ఎగుమతై ఎక్కడ కుల్లి కుల్లి సచ్చేదాన్నో! ఆ బగుమంతుడే చూరపరాజు బాబుగోరి రూపంలో పెత్యచ్చమై నన్ను ఆదుకున్నారేమో. నా ఎత్తు పల్లాలకి ఎగబడితే ఏటయినాది, పెరమనెంటుగా నాకో దారి సూపించినారు. ఆ పెద్ద గుండె మనిసి ఈ పోతరించిన ముండకి సేసినవి ఒకటా రెండా! మందులిప్పించి కొరుకుడు రోగాలు తగ్గించినారు. పోలీసు రాకాసుల్నుండి రచ్చించినారు. ఆల్లందరూ నన్నో పసువులా ఓడుకుంటే యాయన నన్నో మనిసిని సేసినారు. పైగా 'అగ్నిసాక్షిగా పెల్లాడిన నా భార్యకి అగ్నిని రగిలించడం మాత్రమే తెలుసు. అహంకారం తప్ప ఆ జ్వాలని ఆర్పి మనశ్శాంతి ప్రసాదించడం తెలీదు. అది నీకే తెలుసు. ఇంతటి సుఖం యిచ్చిన నీకేమివ్వగలను! పది తరాలకి సరిపడే నా ఆస్తి కూడా పట్టుకుపోతానా! అందుకే ఇంతకి తెగించాను. నీ పేర ఓ యిల్లు కొన్నాను. చెడిపోయిన ఓ ఆడదాన్ని చేరదీసి, దానికింత నీడపట్టు కల్పించిన నా మగతనాన్ని చచ్చేదాకా హాయిగా గుర్తుపెట్టుకుంటాను' అంటూ ఏవేవో సెప్పేవోరు, నా ఒల్లో తలెట్టుకుని. ఆ మాట సెపితే అచ్చరాలు కూడబలుక్కుని సదవడం, సంతకం సెయ్యడం లాంటివి నేరిపినారు. 'ఒంటరిదానివి. ఈ యిల్లే నీకు ఆధారం. కాగితాలు జాగ్రత్త పెట్టుకో. ఇంతటి విశాఖపట్నంలో అదొక్కటే నీకు దిక్కు, గుర్తుంచుకో' అని పాపం కన్ను మూసేదాకా సెప్తూండే వోరు.

ఇల్లంటే ఏటనుకుంతన్నారు? 'సౌజన్య ఎపార్ట్‌మెంట్సు' అనే బోరుడు కట్టపడి సదవగలనేమో గాని, అయిదంతస్తుల ఈ కోటనాటి బిలిడింగు నా నోట 'సావుజన్య వేర్పాటుమెంట్సు' గానే పలుకుతాది. ఇందల ఓ వెపార్టుమెంటులో ఓ వాటా, ఆ చూరపరాజు గోరి దర్మమా అని ఇప్పుడు నా సొంతం. ఓ పాలి మా బిలిడింగు పై డాబా మీనకొచ్చి మీరే సూడండి. కల్లు గిర్రున తిరిగిపోతాయి. ఓ దుక్కుల రాగవేందరసామి కోవెలా, మరో దిక్కుల అప్పులో ఆసుపత్తిరీ! వొవడయినా ఎనక పాట్నించొచ్చి తోసెస్తే ఎముకైనా మిగల్దు! అక్కడో పొద్దు నిలబడి అటూ యిటూ సూత్తుంటే వొవలో ఎనక నుంచొచ్చి బుజం మీన సెయ్యేస్తే ఉలిక్కిపడి ఇటు తిరిగినాను!

'ఓ సోసి, ఒరనొచ్చీ నువ్వేనటే! ఎన్నాల్లకి అగుపించినావే! నీ కోసం ఎన్ని సుట్లు ఎన్ని ఊర్లు తిరిగినానే! సూసారా పీడరు బాబుగోరూ, నా అదురుట్టం బాగుండి మాయావిడ నాకు దక్కినాది. బగుమంతుడు నేడా!'

వొవుడ్రా యీడు అనుకొని సూడగా సూడగా యాది కొచ్చినాది. పోయిన పుసకరాలకి నన్ను సేరదీసిన పాండ్రంకి పాపారావుగోడే. కిల్లీకొట్టు నడిపోవోడు కదూ! కానీ సంపాదన నేదుగాని యిలా సీకటడోతలికి ఆ సేతిలో సీసా ఈ సేతిలో పాపా అమరిపోవాల దొంగనాకొడుక్కి. పందికొక్కులా ఉండేవోడు పాల పీకలా తయాడయాడెదవ. అలా అడ్డి పోలీసు లాకప్పులో ఎట్టినారని తెలిగానే ఇటు పారొచ్చినాను గానా! ఆనాడయితే యీది కుక్కని గనక యిటుమంటి సచ్చినోల్లంతా సెయ్యేసే ఓల్లు. నా కరమం కాలి ఆ దరుమాత్ముడి ఆయుసు తీరిపోనాది గాని ఆరిచ్చిన యిల్లు ఉందనే ఉంది గంద! ఈ ఎలక నాయాల ఈ పొద్దొచ్చి వొవడ్నో తోడు తీసుకుచ్చి 'మా యావిడ' అంటాడేటి? నా పేర కార్టర్నొకటి ఉందని తెలుసుకొని దాన్ని దకలు పుచ్చుకుందామని ఒచ్చినాడు కాబోలే గుంటనక్కగోడు. ఇంకా ఆనాటి ఎర్రి ఒరనచ్చినే అనుకుంటున్నాడు గావాల!

'పాత బుద్దులన్నీ ఒగ్గేసినాను ఒరనచ్చీ, యిక ఆయిగా ఉందాం. వెపార్ట్‌మెంట్ ఏదో సంపాయించి నావుట గందా, వందులో సిల్కా గోరింకాల్లో పడుందాం. నివ్వూ సెడుసావాసాలన్నీ ఇడిసేసి నా వంట గందా!'

'ఆరి ఎలకా నాకొడక, ఇదిట్రా నీ ఏసకం? కోడిపీక నులిమినట్టు మనుసుల్నీ నొక్కేసే మర్దరు గోడివి. నన్ను ఊదెయ్యడానికి నీకేం కట్టం?'

ఇక వల్లకుండడం నా సేత కానేదు. ఇరుసుకు పడిపోనాను.

'ఏట్రా దగుల్బాజీనాయాల, 'ఆవిడ' ఆవిడంతున్నావ్, నానేం నీకు కట్టుకున్న పెల్లాన్నిట్రా? మరి నా మెల్లో సెత మానం ఏది? ఏటి పీడరు బాబూ, తమరేమంతరు?'

'అమ్మా నీలాంటి పతివ్రతామతల్లులు కట్టిన తాళినైనా పుటుక్కున తెంపగల సమర్థులే! అందుకనే మా జాగ్రత్తలో మేం ఉంటాం. ఇదిగో ఆల్బమ్‌లోని యీ ఫొటోలూ, యీ కాగితాలూ చిత్తగించండి.'

ఆడు ఎలిగించిన పెద్ద బేట్రేనయిటు ఎలుగులో అవి సూద్దునూ, కల్లు గిర్రున తిరిగినాయి. కాల్లు లొట లొటలాడినాయి.

నానూ ఆ పాపారావుగోడూ పెల్లి దండలేసుకోని పక్కపక్కని సిమ్మాద్రి అప్పన్న పెల్లి మండపంలో కూకున్న పొటో ఒకటి!

ఆ పొటోలోని ఆడబొమ్మ నానే. చందేగం నేదు!

అంతేనా?

వొయిజాగు అక్కయపాలెం పెల్లిల్ల రిజట్టర్ ఆపీచులో పెల్లయిన పెమానికంగా మా యిద్దరి బొమ్మలూ, చంతకాలూ!

చంతకం సెయ్యడం సూరపరాజు బాబుగోరు నేరిపి నోరు గందా, అది నాదే!

ఓలమ్మ ఓలమ్మ నానేటి సేతును! ఇంతన్నాయమా, ఇంత గోరమా!

'ఒసే ఒరనొచ్చీ! సితక్కొట్టిన సింతకాయ రుసి పెరు గుద్ది గాని తగ్గదు. అంతలా తలతల లాడిపోతున్నవ్... ఇంకాస్సేపుంటే యీ పీడరు బాబే నీ మీన సెయ్యేసేలా ఉన్నాడు. మాం ఎల్తాం. మా ఆవిడ కనిపించి నాదిగందా, మా చేగితుడికి నాను పారిటీ యిచ్చుకోవాల. బాగా రేతిరి ఏల ఒస్తానూ, ఒస్తాను. ఇంకేటి మనకి పెతిరాత్రీ ఒసంత రాత్రీ.. ఈ రాతిరే కొత్త ఒయిలేసుకుందారి. నన్ను గాలిలో తేలిపోయేలా చేసే పూచీ నీదే. పదండి బాబుగారూ!'

డాబా దిగి యిద్దరూ ఎల్లిపోనారు.

నా వాటాకి సేరుకుని ఉసూరుమని కూలబడినాను. ఏటి సెయ్యాలో ఈ దురుమార్గం ఎలా అడ్డుకోవాలో ఏమాతరం దారి కాపడక కల్లనీలెట్టుకుని కూకుండిపోనాను. దొంగ సాచ్చికాలు బనాయించి కట్టుకున్న పెల్లాన్నని పీడరు నా కొడుకులే బద్దమైపోనాడు. ఈ రాతిరే మల్లొస్తనం టన్నడు. ఈ పాపిస్టోణ్ణి ఒగ్గించుకోడం ఎలా? ఎలా? నన్నే దేవుడు కాపాడుతాడు!'

తెలిసిన దేవుల్లందరికీ పేరు పేరు వరసన మొక్కినాను గాని యీ సీకట్లోంచి ఎలా బయలెల్లడమో ఏ ఒక్కరూ సెప్పినారు కారు.

'ఎవరూ చెప్పరు. నిన్ను నువ్వే రక్షించుకోవాలి'

దయిర్యం కోసం గుండెల్ని ఆనించి ఎట్టుకున్న సూరపరాజుగారి పొటో మాటాడినట్టయినాది. తలుపు తీసుకు ఆడు రానే ఒచ్చినాడు.

'..కట్టుకున్న మగాడికి కాలికి దండ మెట్టడం కాదు, గాలిలో తేలిపోయే సుకం పెసాదించాలి – బేగి రాయే.'

ఆడి మాటల్లో ఏదో కొత్త అరదం తోచినాది. కొత్తగా తోసిన ఆలోసనతో నా మొగం మారిపోనాది. దారి స్పస్టంగా కనుపడుతున్నాదిప్పుడు. దయిర్యం తెచ్చుకుని లేసి, నిల్చుని, ఆడి సెయ్యట్టుకున్నాను.

'ఇయ్యన్నీ మరియాదస్తుల యిల్లు. పైకెల్లి మనసు తీర్చుకుందాం పద' ఫుల్‌గా ఎక్కించిన ఆ తాగుబోతుని ఆ మెట్లన్నీ ఎక్కించి డాబా మీదకి తోలికెల్లేసరికే నాకు ఎగసేస ఒచ్చినాది.

ఆ ఊసూ ఈ ఊసూ చెబుతూ డాబా అంచుకి తోలికెల్లినాను.

'ఇంకా ఆలెస్సెం ఏటే నా రాజా రంగుల్రానీ! ఏభై దాటినా ఏపిల్ పండులా అగపడతన్నావ్ కదే!'

ముందురోజు ఒన పడిందేమో జారు జారుగా ఉంది నేల. ఓ దిక్కుల మరీ జోరుగా ఉంది. అటు నెట్టినాను.

(మిగతా 50వ పేజీలో)...

# 'అణగదొక్కిన పూవు'

-ఎ.సువర్ణ

'రాత్రి చాలా పొద్దుపోయింది. అతనింకా ఇంటికి రాలేదు. కడుపులో ఆకలి బాధ ఎక్కువైపోయింది... ఆకలిగా వుంది కదా అని అతను రాకుండా నేను ముందు అన్నం తినకూడదు.

'ఇంత పొద్దుపోయేంతవరకూ ఇంటికి రానంత అర్జెంటు పనులేం లేవు... ఆయనగార్కి.. ఎవరితోనైనా తగూలుపడడమే ఆయన పని.

క్రితం వారం ఇట్లాగే ఆకలికి ఆగలేక ఆయన రాకముందే అన్నం తిన్నానని, ఇంట్లోకి వస్తూనే "అన్నం తిన్నావా...?" అని అడిగాడు.

"తిన్నాను"... అని తలాడించడం ఆలస్యం పొడవాటి జడను చేతికి చుట్టుకుని లాగి చెంపకాయ కొట్టడంతో ఆగకుండా తలను గోడకేసి రంగ్.. రంగ్ మని కొట్టడంలో తల పగిలిపోతుందనిపించింది.

ప్రేమపాశం... భార్యననే భావం లేకపోతే పోనీ మనిషినన్న దయాదాక్షిణ్యాలనేవైనా లేకుండా ఇలా తిట్టి కొట్టి హింసించడం కేవలం భోజనం విషయంలో మాత్రమే కాదు.

"నేను పగలంతా ఇంట్లో వుండనప్పుడు నీకెందుకే పౌడర్లు స్నోలు ఈ వేషాలన్నీ ఎవరి కోసం... మూల కూర్చునేందుకు ఓ పాత చీర కట్టుకుంటే చాలదూ..." అతి మామూలుగా మీద నిప్పులు కుమ్మరిస్తాడు.

నాన్న ఎంతోమంది జాతకాలతో సరిపోల్చి ఎవరి జాతకం సరిపోక ఆఖరికి ఈ ప్రబుద్ధుని జాతకంతో సరిపోయిందని పెళ్లి చేశాడు. ఒక్క జాతకంతో మాత్రమే.. మిగతా ఏవీ సరిపోలేదు.

గవర్నమెంటు ఉద్యోగంలో వున్నాడు.. కటింగ్స్ అన్నీ పోగా చేతికి నెలనెలా ఏడెనిమిది వేలదాకా వస్తుంది అని ఎంతోమంది చెప్పింది నమ్మకుండా నాన్న, అన్నయ్య స్వయంగా అతను పనిచేసే ఆఫీసుకెళ్లి విచారించి అది నిజమేనని నిర్ధారణ చేసుకొచ్చారు. అంగలకుదురులో వుండేవాళ్లు తమకు దూరపు చుట్టరికం అని అతను చాల మంచివాడని చెప్పాక అమ్మ నాన్నలు మరేం ఆలోచించలేదు. అతనితో పెళ్లి జరిపించి కాపురానికి బాపట్ల పంపించారు.

పెళ్లి అయిన ఆరు నెలలకే అతని ఉద్యోగం తాత్కాలికం, ఎవరో లాంగ్ లీవులో వుంటే అతని స్థానంలో టెంపరరీగా అతన్ని అపాయింట్ చేసుకున్నారని తెలిసి తను అదిరిపోయింది.

జాబ్ టెంపరరీ అయినప్పటికీ ప్రభుత్వం అతన్ని నమ్మి ఫైనాన్స్ డిపార్ట్‌మెంటు బాధ్యతలు అప్పగించారు... అక్కడ తను కొన్ని లక్షలు భోంచేసే సరికి ఉద్యోగం నుంచి తొలగించారు. తగిన సాక్ష్యాధారాలు లేని కారణంగా అరెస్టు, పోలీసులు, జైలు అన్న వాటి నుంచి తప్పించుకున్నాడు.

ఉద్యోగం సద్యోగం లేకుండా తిరుగుతున్న ఈయన మనసు రాజకీయాల మీదికి పోయింది. ఓ రాజకీయ పార్టీలో చేరాడు.

హఠాత్తుగా ఓ రోజు ఆ జిల్లా పార్టీ ప్రెసిడెంటుగా తనని పార్టీ అధికారి నియమించినట్లు చెప్పాడు... ప్రతీ రోజూ పొద్దున వెళ్లినాయన తిరిగి రావడం రాత్రికే!... అడిగితే "రాజకీయాలలో తిరిగేవాడిని... బయట నాకు లక్షా తొంభై పనులు!... ఎన్నో రాచకార్యాలు చక్కపెట్టాలి... అవన్నీ నీకనవసరం" అని నా నోరు నొక్కాడు... పుట్టింటికి వెళ్లి ఈయన రంగు బయటపెట్టాలనుకుంది... అందుకు మనసొప్పలేదు..

అలా చేస్తే నాన్నకు గుండె పగిలిపోతుంది.

నాన్నగారు తనని కలెక్టరుగా చూడాలని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు... అమ్మే..! ప్లస్ టూ పరీక్షలు కూడా రాయకుండానే మంచి సంబంధం చెయ్యి దాటిపోతుందని పట్టుపట్టి నన్నీ నరక కూపంలోకి తోసింది...

'హూ! వాళ్లు మాత్రం నరక కూపం అని అనుకున్నారా... అనుకుంటే ఈ పెళ్లిచేసి వుండేవారు కారు.'

"అమ్మాయిని ఎక్కువగా చదివిస్తే అంతకంటే ఎక్కువ చదివిన వాడిని తీసుకురావడం కష్టం" అని అందరూ చేసిన బ్రెయిన్ వాష్ నన్నతనికి కట్టపెట్టడానికి కారణం అయింది.

పెళ్లి ఒక్కటే ఆడపిల్లలకు రక్షణ కవచం అని నమ్మిన అమ్మ నాన్నలు... ఇప్పుడితని చేతికి చిక్కి అవస్థలు పడుతున్నది అమ్మ నాన్న కారు... తను! తను మాత్రమే..!

అవన్నీ తల్చుకున్న కొద్దీ లోపల నుంచి దుఃఖం పొంగుకొస్తున్నది..! ఇతన్ని ఎలా వదిలేసి పోవాలో అర్థంకాక పడున్నది.

చుట్టూ పూర్తి చీకట్లు అలుముకున్నయ్... రాత్రి బాగా పొద్దుపోయింది... చుట్టుపక్కల ఇళ్లలో అంతవరకూ మోగుతున్న టీవీలన్నీ మూగపోయినయి... లైట్లు ఆఫ్ అయి అందరూ మంచాలెక్కారు.

కడుపులో నకనకలాడిపోతున్నది... అన్నం తినడానికి భయంగా వుంది... లోపలకొచ్చి తలుపు గడియ పెట్టింది.

వంటింట్లోకి వచ్చి బిందెలోంచి చెంబెడు నీళ్లు ముంచుకు కడుపునిండా తాగింది... ఆకలి కాస్త తగ్గినట్లనిపించింది.

మళ్లీ వాకిలి తలుపు తెరుచుకు బయటకొచ్చింది... చిన్నప్పుడు ఆకలేస్తే తినడానికని ఇంట్లో నాలుగైదు రకాల చేగోడీలు జంతికలు రవ్వలడ్లు అరిసెలు అని చిరుతిళ్లు ఎప్పుడూ సిద్ధంగా చేసిపెట్టేది అమ్మ... ఇక్కడ ఆకలేస్తే అన్నం తినడానికీ వీలుకాదు.

మెడలో, చేతులకున్న నగలన్నీ... ఆ వ్యాపారం చేస్తాను, ఈ వ్యాపారం చేస్తానంటూ తీసికెళ్లి అమ్మాడే కానీ ఇంతవరకూ ఏ వ్యాపారం చేసిన పాపాన పోలేదు.

ఇంకపైన అమ్మేందుకు ఒంటిమీద చిన్నమెత్తు బంగారం కూడా లేదు... వున్న రెండు కాసుల రెండు పేటల గొలుసు వారం కిందట పట్టుకుపోయి అమ్మాడు.

కొంచెం దూరంలో వున్న వేపచెట్టు గాలి వచ్చి శరీరాన్ని చల్లగా తాకింది... ఆకాశంలోకి చూశాను... మెరిసే నక్షత్రాలు కనిపించినయి.

మా ఊళ్లోనూ వేసంకాలం రాత్రిళ్లు ఆరుబయట మంచంలో పడుకుని ఆకాశంలోని నక్షత్రాలనే చూసేదాన్ని... అవి నా కళ్లకు ఎలా కనపడేవంటే... మెరిసే వజ్రాల దుద్దులుగానూ, చేతికున్న ఉంగరంలోని మూడు అమెరికన్ డైమండ్స్‌లాను కనిపించే ఆ నక్షత్రాల తెల్లటి మెరుపుని చూసి ఎంతగానో పరవశించేదాన్ని.

'హూ... ఇవ్వాళ ఈ నక్షత్రాల మెరుపు ఆకాశంలోనే పరిమితం అయింది! నా మనసు లోపలంతా చీకటే..!

'ఈయనెప్పటికి వస్తాడో! తను అన్నం తినేదెప్పటికో! వచ్చేజాడ ఏమైనా కనిపిస్తుందా అని రోడ్డు చివరిదాకా చూశాను. వూహూ...! "ఇవ్వాళ ఎవరో పెద్ద నాయకుడొస్తున్నాడు... పెద్ద మీటింగు వుందని పొద్దున వెళ్లినాయన ఎక్కడున్నట్లు...? ఏం చేస్తున్నట్లో..!

పడుకుంటే ప్రశాంతంగా నిద్రపోలేదు... ఏ క్షణానైనా వచ్చి తలుపుల్ని పారతో పగలకొడుతున్నట్లు దబదబా బాదుతాడు తలుపు తీసేంతవరకూ ఆగకుండా..! అంతటితో ఆగితే ఏ బాధా లేదు... మాటల బాణాలతో మనసుని గాయపరిచి నిద్ర లేకుండా చేస్తాడు దుర్మార్గుడు.

ఓ సంవత్సరంలో ఆరు పార్టీలు మారాడు. ఏ పార్టీలోనూ నమ్మకంగా పనిచెయ్యడు... అందరితోనూ విరోధమేనట... అని ఎవరో ఒకరు వచ్చి నా చెవిన వేసి వెడతారు.

ఈయనకు బుద్ధి చెప్పేదెవరూ...? ఒక పార్టీలో చేరి వాళ్ల గుట్టుమట్లను బలహీనాలను తెలుసుకుని ఆ పార్టీని వదిలేసి మరో పార్టీలో చేరి వదిలేసిన పార్టీ వాళ్లని బ్లాక్‌మెయిల్ చేస్తాడు.. గూఢచారి పనిచేస్తాడు.

ఇతని వల్ల ఊళ్లో తరచు అల్లర్లు కలవరాలు ఘర్షణలు... పుల్లలు పెట్టి మంట ఎగదోస్తా ఘర్షణలకు నాంది పలుకుతాడు..

అలా ఏమైనా జరిగితే... అనుకోవడం ఆలస్యం.. వీధి మొదట్లో ఆటో ఆగింది... అబ్బ... ఒళ్లంతా జలదరించింది... ఇద్దరు చెరో రెక్క పట్టుకు నడిపించుకు తీసుకొస్తున్నారు. ఒకతని భుజం మీద తల ఆన్చుకుని మెల్లగా నడిచి వస్తున్నాడు.

"అమ్మగారూ మన నాయకుని విరోధ పక్షం వాళ్లు దారుణంగా నరికి హత్యచేశారు... పొద్దుటి నుంచీ ఊళ్లో ఎక్కడ చూసినా అల్లర్లే... ఈయనను కొట్టారు... ఎలాగో ఇప్పటికి ఇంటికి చేర్చగలిగాము...

(50వ పేజీ తరువాయి)...

'ఇదేం సరసమే?'

'పెల్లయి పోనాది గందా, ఇక చుబ్బరంగా చోబనం సేసేసుకుందారనీ!'

అని ఆడి అరికాల్లట్టుకున్నాను. అక్కడ కితకిత పెట్టి ఆడ్ని కిర్రెక్కించడం నాకు తెల్సిన యిద్యే.

'ఒద్దే... ఒద్దే... ఒగ్గెయ్యవే... నాను తట్టుకోలేనే'

ఇక తట్టుకునేదేటి దొంగెదవ.. కాల్లు అందుకున్నట్టే అందుకుని ఒక్క ఊపుతో పిట్టగోడ నుంచి గాలిలోకి తేల్చేశాను. కిందకయినా సూరనేదు. ఏటైపోనాడో ఎరికనేదు. ఆడు 'ఏటైనా అయిపోడమే' కదా నాను కోరుకొనేది. అదే జరిగినాది. అమ్మయ్య! ■